సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



అంబేడ్కర్ కలల సాకారానికి కృషి

సిరిసిల్లకల్చరల్: అంబేడ్కర్ కలలు.. సమర సతా సమాజం కోసం ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రాంత సహ కార్యవాహ మల్లికార్జున్ స్పష్టం చేశారు. - 8లో▸



అభివృద్ధిలో 'గంభీరం'

గంభీరావుపేట(సిరిసిల్ల): మౌలిక వసతుల కల్పనలో ఆదర్శంగా నిలిచిన గంభీరావుపేట సర్పంచ్ సోమవారం ఢిల్లీలో జాతీయ అవార్డు అందుకోబోతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. రాత్రి వేళ చలిగాలులు వేగంగా వీస్తాయి.

నీతి నిజాయితీగా సంపాదించేదే ఉత్తమ సంపద
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
సోమ 6.36	మంగళ 4.30

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

దాతలు స్పందిస్తున్నారు



సాయం అందిస్తున్న నాయకులు

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన ద్యావ రేవతి–శ్రీకాంత్‌రెడ్డి దంపతుల కుమారుడు రుద్రాన్ష్‌రెడ్డి పురుగుల మందు తాగగా.. ఆపరేషన్ కోసం దాతలు స్పందిస్తున్నారు. బాలుడు ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగగా పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచనలతో హైదరాబాద్‌లోని రేయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. ఆపరేషన్‌కు రూ.10లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ దంపతులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. 'బాలుడికి ప్రాణభిక్ష పెట్టండి' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.10వేలు అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన 2002–2003 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు రూ.13 వేలు అందించారు. మూడురోజుల్లో రూ.79వేలు దాతల ద్వారా సమకూరాయి. మరి కొందరు ముందుకొస్తు బాలుడి ప్రాణాలను కాపాడవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

'దివ్యాంగులపై దాడులను అరికట్టాలి'



మాట్లాడుతున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేందర్

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో దివ్యాంగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ కోరారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి గణేశ్, కోశాధికారి మామిడాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి పెట్టాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విశాఖ ఇండస్ట్రియల్ డైరెక్టర్, నాయకులు

చందుర్తి(వేములవాడ): విద్యతోపాటు క్రీడలపై యువకులు ఆసక్తి పెంచుకోవాలని విశాఖ ఇండస్ట్రియల్ డైరెక్టర్ జోగినిపల్లి పృథ్వీరావు కోరారు. చందుర్తి మండలం మూడపల్లిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని ఆదివారం సర్పంచ్ చిలుక అంజిబాబు తన తండ్రి చిలుక కొండయ్య జ్ఞాపకార్థం నిర్వహించారు. విశాఖ ఇండస్ట్రియల్ డైరెక్టర్ పృథ్వీరావు మాట్లాడుతూ గ్రామం నుంచి యువకులు క్రీడాకారులుగా రాణించాలని కోరారు. రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివా స్, సర్పంచ్ చిలుక అంజిబాబు, యునైటెడ్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు బీమా పత్రాలు పంపిణీ



బీమాకార్డులు అందిస్తున్న తుల ఉమా

వేములవాడఅర్బన్: వేములవాడలో తెలంగాణ సేవ టాక్సీ ఆల్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు బీమాపత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా హాజరయ్యారు.

పల్లెలు మారుతున్నాయి..



- ఈ చిత్రంలో కనిపిస్తున్న రెండంతస్తుల భవనం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఓ వ్యాపారి నిర్మిస్తున్నారు. ఒకప్పుడు పాత ఇల్లు ఉన్న ఈ స్థలంలో ఆధునిక వసతులతో భవనం నిర్మిస్తున్నారు. దాదాపు రూ.కోటి వరకు వెచ్చిస్తున్నారు. ఉన్న ఊరిలోనే వసతులతో కూడిన భవనాన్ని నిర్మించుకుంటున్నారు.



ఈ భవనం దుబాయిలో స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐది. మండల కేంద్రంలోని కొత్త బైపాస్‌రోడ్డుకు సమీపంలో నిర్మించిన ఈ భవనంలో ఆధునిక వసతులు ఏర్పాటు చేసుకున్నారు. ఇంటీరియల్ డిజైన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. దాదాపు ఐదారేళ్ల క్రితమే రూ.కోటికి పైగా వెచ్చించిఈ భవనాన్ని నిర్మించారు.



- బహుళ అంతస్తుల భవనాలు
- అదిరిపోతున్న ఇంటీరియల్ డిజైన్స్
- లగ్జరీ కార్లు.. స్పోర్ట్స్ బైక్స్
- రూ.30లక్షల నుంచి రూ.2 కోట్ల వ్యయంతో భవనాలు
- కల్లోల పల్లెల్లో ఆధునిక వసతులు
- ఇతర రాష్ట్రాల కార్మికులకు ఉపాధి

జిల్లా వాసుల సమాచారం
గల్ఫ్ దేశాల్లో ఉంటున్న వారు : 50వేలు
సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్ : 4 వేల నుంచి 5 వేలు
రియల్ వ్యాపారులు : 500
బడా వ్యాపారులు : 400
ఆధునిక బైక్స్ : 1000
కార్లు : 3 వేలు నుంచి 4 వేలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పోలీసుల బూట్ల చప్పుళ్లు.. నక్సలైట్ల తుపాకుల మోతలతో నిత్యం మేల్కొన్న పల్లెల్లో నేడు కార్ల శబ్దాలు.. స్పోర్ట్స్‌బైక్స్ మోతలతో తెల్లవారుతోంది. ఆనాటి కల్లోలిత ప్రాంతం.. కాలానికనుగుణంగా మారుతోంది. యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లడం.. కాస్త ఆర్థికంగా ఉన్న వారు ఇక్కడే వ్యాపారులు చేస్తుండడం.. గతంలో ఎందుకూ పనికిరావనుకున్న భూముల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో పల్లెల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయి. నాటి కల్లోల పల్లెల్లో నేడు ఎటూ చూసిన ఆధునిక భవంతులు.. అత్యాధునిక వాహనాలు కనిపిస్తున్నాయి.

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 255 గ్రామపంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆధునిక భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. భవన నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్ సైతం స్థానికంగా లభిస్తుండడంతో నిర్మాణదారులకు వ్యయప్రయాసాలు తగ్గుతున్నాయి.

రియల్‌భూమ్.. దుబాయి వలసలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రియల్ వ్యాపారం జోరందుకుంది. మండల కేంద్రాల్లో ఒక్కో గుంట అత్యల్పంగా రూ.15 లక్షల నుంచి అత్యధికంగా రూ.50 లక్షల వరకు పలుకుతున్నాయి. ఒకప్పుడు ఎందుకు పనికిరావనుకున్న భూములు నేడు లక్షల్లో పలుకుతుండడంతో అప్పటి వరకు సామాన్యంగా జీవించిన వారు ఆధునిక వసతులు కల్పించుకుంటున్నారు. జిల్లాలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రోడ్డుకు ఆనుకుని, సమీపంలోని భూములు ఉన్న రైతులు నేడు రియల్ వ్యాపారం చేస్తూ కోట్లు గడిస్తున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌కు తీసిపోని రీతిలో భవనాలు నిర్మించుకుంటూ, ఇంటీరియల్ డెకరేషన్ చేయించుకుంటున్నారు. అంతేకాకుండా ప్రతీ భవంతిలో నేడు ఏసీ(ఎయిర్‌కండీషనర్లు) కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని యువతలో ఎక్కువ శాతం ఉపాధి కోసం దుబాయి వెళ్తున్నారు. దుబాయిలో నెలకు తక్కువకు తక్కువగా రూ.50వేల వరకు సంపాదిస్తున్నారు. అక్కడ వారు సంపాదించిన డబ్బును ఇక్కడే ఉంటున్న కుటుంబ సభ్యులకు పంపుతుండడంతో వారు ఇక్కడ భూములు కొని ఆర్థికంగా స్థిరపడుతున్నారు. వీరితోపాటు ఉన్నత చదువులు చదివిన వారు హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు దాదాపు 3 వేల మంది వరకు దేశంతోపాటు విదేశాల్లో స్థిరపడ్డారు. వారంతా ఇక్కడ ఆస్తులు కొంటున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.30 లక్షల నుంచి రూ.2కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. ప్రతీ పల్లెలో దాదాపు పది నుంచి ఇరువై వరకు కార్లు కనిపిస్తున్నాయి. ఇంటికొక బైక్ తప్పనిసరిగా మారింది. కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న స్పోర్ట్స్‌బైక్స్‌ను యువకులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్, అపాచి వంటి బైక్‌లు దాదాపు వెయ్యి వరకు రోడ్లపై తిరుగుతున్నాయి.

ఇతర ప్రాంత కార్మికులకు ఉపాధి

- ఈ ప్రాంతంలో కొనసాగుతున్న భవన నిర్మాణాలతో ఇతర ప్రాంత కార్మికులకు ఉపాధి పుష్కలంగా లభిస్తుంది. స్థానికంగా కార్మికుల కొరత ఉండడంతో ఇక్కడి వారే బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల నుంచి ఇంటీరియల్ డిజైనర్స్‌ను, మార్బుల్స్ వేసే కార్మికులను తెప్పిస్తున్నారు. ఇక్కడి కాంట్రాక్టర్లు అక్కడి కార్మికులతో ఒప్పందం చేసుకొని.. భోజన వసతి కల్పిస్తూ.. వేతనాలు ఇచ్చేలా ఒప్పందం చేసుకుంటున్నారు. టైల్స్‌మేషన్స్, పవర్ సీలింగ్, కప్‌బోర్డ్స్, పేయింటర్స్ వంటి నైపుణ్యం ఉన్న దాదాపు పది వేల మంది కార్మికులు ఈ ప్రాంతంలో నిత్యం ఉపాధి పొందుతున్నారు.

డిజైన్లపై ఆసక్తి



ఇంటీరియల్ డిజైన్స్, త్రీడీ డిజైన్స్‌పై ఆసక్తి చూపుతున్నా రు. ఒకప్పుడు గల్ఫ్ దేశాల్లో ఇలాంటి డిజైన్స్ ఉండేవి. ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లిన యువకులు ఆ డిజైన్స్‌ను ఇష్టపడి తమ ఇళ్లల్లో వేయించుకుంటున్నారు. బెడ్‌రూమ్స్, హాల్స్‌లలో పేయింటింగ్స్ విషయంలో ఎంత ఖర్చయినా తగ్గడం లేదు.

– అనిల్, ఆర్టిస్ట్

90 మంది పనిచేస్తున్నారు



నేను ముప్పై ఏళ్ల క్రితం ఆంధ్ర ప్రాంతం నుంచి ఎల్లారెడ్డిపేటకు వలస వచ్చాను. మొదట్లో చిన్న చిన్న రిపేర్లు చేస్తూ ఉపాధి పొందాను. ఇప్పుడు పరిస్థితులు మారాయి. పెద్ద.. పెద్ద భవంతులు నిర్మించుకుంటున్నారు. నా దగ్గర మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన 90 మంది కార్మికులు పనిచేస్తున్నారు.

– కంది లక్ష్మారెడ్డి, భవన నిర్మాణ కాంట్రాక్టర్

టేకు కర్రను ఇష్టపడుతున్నారు



సిరిసిల్ల ప్రాంతానికి మహారాష్ట్రతోపాటు మధ్యప్రదేశ్, కర్ణాటకల నుంచి టేకు కర్రను తెప్పిస్తున్నాం. భవన యజమానులు టేకు కర్ర కోసం ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. ఆర్చీ దర్వాజాలు, కిటికీలను ఇంజినీర్ ఇచ్చిన ప్లాన్ ప్రకారం తయారు చేసి ఇస్తున్నాం. ఒక్కో భవన టేకు కర్రకు దాదాపు రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంది.

– కొడుమోజు దేవేందర్, కార్పెంటర్

నిందితులను శిక్షించాలి

- ఎన్గల్‌లో యువకుడి బంధువులు, కుటుంబ సభ్యుల ధర్నా
- న్యాయం చేయాలని డిమాండ్
- పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ



ధర్నా చేస్తున్న బంధువులు, గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): ప్రేమిస్తేనే ప్రాణాలు తీస్తారా.. అంటూ మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. బోయినపల్లి మండలం కోరెంలో బుధవారం జరిగిన బీరప్ప ఉత్సవాలకు వెళ్లిన మండలంలోని లింగంపేటకు చెందిన బండారి శివను అతను ప్రేమించిన యువతి బంధువులు దాడి చేయడంతో మృతిచెందాడని బంధువులు ఆందోళన చేపట్టారు. నిందితులను శిక్షించాలంటూ ఎన్గల్ రోడ్డుపై ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడి చేరుకున్నారు. ప్రియురాలు ఇంటి ఎదుట ఆందోళన చేపట్టేందుకు వెళ్లిన కొందరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు రోడ్డుపై రాస్తారోకో చేపట్టడంతో వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ వారితో మాట్లాడారు. న్యాయం చేస్తామని.. ఆందోళన విరమించాలని కోరడంతో వారు శాంతించారు. అయినప్పటికీ ఎన్గల్, లింగంపేట గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ తోపాటు చందుర్తి, కోనరావుపేట ఎస్సైలు రమేశ్, రమాకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ప్రశాంతంగా మోడల్ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్స్

సిరిసిల్లఎడ్యుకేషన్: రాజన్నసిరిసిల్ల జిల్లాలోని మోడల్‌స్కూళ్లలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాలలో పరీక్ష జరిగినట్లు వివరించారు. 6వ తరగతిలో 1,347 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,175 మంది హాజరయ్యారు. ఏడో తరగతిలో 365 మంది దరఖాస్తు చేసుకోగా.. 321 మంది హాజరయ్యారు. 8వ తరగతిలో 247 మంది దరఖాస్తు చేసుకోగా 217 మంది హాజరయ్యారు. 9వ తరగతిలో మిగిలిన సీట్లకు 128 మంది దరఖాస్తు చేసుకుని 118 మంది, పదోతరగతిలో 37 మంది దరఖాస్తు చేసుకుని 30 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు వివరించారు.

యథేచ్ఛగా వన్యప్రాణుల వధ



ఈ వ్యక్తి పేరు భుక్యా కిశోర్. కోనరావుపేట మండలం జైసేవాలాల్ భుక్యారెడ్డితండా. ఈ నెల 6న వేకువజామున మరిమడ్లకు చెందిన ఓ వ్యక్తి భూమిని దున్నేందుకు ఆ గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు.

- రాత్రి వేళ వేట
- పట్టించుకోని అధికారులు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలంలోని అటవీ సమీప గ్రామాల్లో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. అటవీ జంతువుల వేట కోసం పెట్టిన విద్యుత్ తీగలు మనుషుల ప్రాణాలు బలిగొంటున్నాయి. ఇంతా జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

వన్యప్రాణుల మాంసం విక్రయాలు

మండలంలోని మరిమడ్ల, అహ్మద్‌హుస్సేన్‌పల్లి, వట్టిమల్ల, శివంగాలపల్లి, ధర్మారం, సిరికొండ మండలం తాటిపెల్లి ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట సాగుతోంది. రాత్రి పూట ఆహారం కోసం పంట పొలాలకు వచ్చే జంతువులను వేటగాళ్లు విద్యుత్ తీగలతో మట్టుబెడుతున్నారు. వాటి మాంసాన్ని కుప్పలుగా పెట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో కుప్పకు రూ.200 నుంచి రూ.300 వరకు అమ్ముకుంటున్నారు.



గ్రామాల్లో అమ్మకానికి తెచ్చిన అడవిపంది మాంసం

నీటి కోసం వచ్చి బలి

నీటి కోసం సమీప గ్రామాలకు వచ్చి బలవుతున్నాయి. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో అడవుల్లో నీటి నిల్వలు తగ్గిపోగా.. జంతువులు గ్రామాల వైపు వస్తూ వేటగాళ్ల వలలో చిక్కుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో కుక్కలు సైతం దాడి చేస్తున్నాయి.

బలవుతున్న రైతుల ప్రాణాలు

- 2020 సెప్టెంబర్ 27న సిరిసిల్ల మండలం చిన్నబోనాలకు చెందిన బానోత్ దేవయ్య(55) భార్య మృతిచెందడంతో కొండాపూర్ హనుమాన్‌తండాలోని కూతురు వద్ద ఉంటున్నాడు. హనుమాన్‌తండా శివారులోని పెంటివాగు వద్దకు చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలోనే ఒడ్డు ఎక్కుతుండగా విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు.
- కోనరావుపేట మండలం బావుసాయిపేటలో బోండ్ల శ్రీనివాస్(25) హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు.
- కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన వేటగాడి వద్ద తుపాకీ, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరికొన్ని గ్రామాల్లో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలతో మేకలు, పశువులు, కుక్కలు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి.
- ఇది తెలిసిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం వేట నిషేధం. మాంసం, అవయవాలు అమ్మితే నేరం. దీనికి ఏడాది నుంచి ఆరేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.5వేల వరకు జరిమానా విధిస్తారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదయిన దాఖలాలు లేవు.

వన్యప్రాణులను వేటాడితే జైలుకే..



అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట నిషేధం. వేటాడితే జైలు శిక్ష తప్పదు. వన్యప్రాణుల మాంసం తింటే మనుషుల ప్రాణాలకే ముప్పు. వాటి మాంసం తినడం ద్వారా గుండెజబ్బులు, నాడీ సంబంధిత, బీపీ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.

– బాపురాజు, సెక్షన్ అధికారులు

నేడు కల్లోల పల్లెల్లో మంత్రి కేటీఆర్ పర్యటన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు

- ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని కల్లోల పల్లెల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు మంత్రి కేటీఆర్ సోమవారం పర్యటించనున్నారు. మంత్రి పర్యటనను పురస్కరించుకొని ఏర్పాట్లను ఆదివారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరిశీలించారు. తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడమేకాకుండా జీపీలకు రూ.20లక్షల వ్యయంతో నూతన భవనాలను నిర్మించారు. ఆగయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడమే కాకుండా జీపీలకు అత్యాధునిక సదుపాయాలతో సొంత భవనాలను సమకూర్చిందన్నారు. మంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.



మంత్రి కేటీఆర్

మంత్రి పర్యటన ఇలా..

- సోమవారం ఉదయం 11 గంటలకు దుమాలలో మల్లన్న పట్నాలకు హాజరవుతారు.
- మధ్యాహ్నం 12 గంటలకు రాజన్నపేట గ్రామ పంచాయతీ భవనం, 12.30 గంటలకు దేవునిగుట్టతండా పంచాయతీ భవనం, ఒంటి గంటకు బాకూరుపల్లితండా పంచాయతీ భవనం, 1.30 గంటలకు రాచర్లతిమ్మాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యాలయ నూతన భవనాలను ప్రారంభిస్తారు.



వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు, కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం, రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమపూజ, గండాదీపంలో నూనెపోశారు. రాజన్నను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు కండువా కప్పి, ప్రసాదాలు అందజేశారు. నాయకులు సాగారం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





క్లుప్తంగా

లక్ష్మణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేత



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల జోన్ : రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్ కుమార్‌ను జగిత్యాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టుకు కేసుల తరలింపు, న్యాయవాదుల సమస్యలను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్ల శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

'బీజేపీని గద్దెదింపాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

జగిత్యాల: బీజేపీని గద్దెదింపి దేశాన్ని రక్షించాలని సీపీఐ నాయకులు అన్నారు. దేశాన్ని రక్షించాలనే నినాదంతో పల్లెపల్లెకు సీపీఐ ప్రజాచైతన్యయాత్ర చేపడుతున్నట్లు జిల్లా కార్యదర్శి సురేశ్ తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈనెల 25న పాతబస్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

టీజీసీజీటీఏ అధ్యక్షుడిగా సత్యప్రకాశ్



ఎన్నికైన సత్యప్రకాశ్

జగిత్యాల : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.సత్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్, కోశాధికారిగా కరుణాకర్ ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి పలువురు అభినందనలు తెలిపారు.

మృత్యు శకటాలుగా టిప్పర్లు

- అతి వేగం..అజాగ్రత్తతో నడపడంతో పెరుగుతున్న ప్రమాదాలు
- దుమ్ము.. ధూళితో అనారోగ్యం బారినపడుతున్న ప్రజలు
- కొరవడిన అధికారుల తనిఖీ

బోయినపల్లి (చొప్పదండి): అతివేగం, అజాగ్రత్తతో రోడ్లపై మట్టి తరలించే టిప్పర్లు మృత్యుశకటాలుగా మారుతున్నాయి. మండలంలో కొన్నినెలలుగా మట్టిని తరలించేందుకు టిప్పర్లకు డిమాండ్ బాగా పెరిగింది. వీలైనన్ని ఎక్కువ ట్రిప్పులు తరలిస్తే అంత ఆదాయం అధికంగా వస్తుందనే కక్కుర్తితో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ సామాన్యుల ప్రాణాలమీదకు తెస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం మండలంలోని స్తంభంపల్లి గ్రామ పరిసరాల్లో టిప్పర్ ఢీకొని గుండన్నపల్లి గ్రామానికి చెందిన మల్లేశం అనే రైతు మృతిచెందడం గ్రామంలో విషాదం నింపింది.

కొన్ని నెలలుగా పెద్దమొత్తంలో..

రియల్ వ్యాపారంతో భూములు చదును చేయడం.. నూతన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పనులకు మట్టి, మొరం తరలించేందుకు డిమాండ్ పెరిగింది. దీంతో ఇటీవల మండలంతో పాటు, వేములవాడ, గంగాధర తదితర పరిసరాల నుంచి టిప్పర్ల ద్వారా మట్టి, మొరం తరలిస్తున్నారు. ఈ క్రమంలో కొన్నినెలలుగా మట్టిని పెద్దమొత్తంలో తరలిస్తున్నారు. కొన్ని రోజులుగా ఓ ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో టిప్పర్ల ద్వారా మట్టి రవాణా చేస్తున్నారు. రోజుకూ దాదాపు 20 నుంచి 30 ట్రిప్పులు మట్టి, మొరాన్ని తరలించిన సందర్భాలున్నాయని పలువురు చెబుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇష్టారీతిగా మట్టి తరలిస్తుండగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రమాదంలో మృతిచెందిన మల్లేశం (ఫైల్)



టిప్పర్ వేగానికి లేచిన దుమ్ము

తనిఖీలు శూన్యం

రోడ్లపై నడుస్తున్న టిప్పర్లకు ఫిట్‌నెస్, వాహన పత్రాలు, లైసెన్స్‌తోపాటు తనిఖీలు చేయాల్సిన ఆర్టీఏ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారు. మండలంలో కొన్నిరోజులుగా జరుగుతున్న మట్టి తరలింపుపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మట్టి ఎక్కడ నుంచి తీస్తున్నారు. యథేచ్ఛగా బయటకు ఎలా తరలిస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ విషయంలో శాఖల మధ్య సమన్వయం లేక తమ పరిధి కాదని దాటవేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బోయినపల్లి– వేములవాడ దారిలో టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారని, దీంతో విపరీతమైన దుమ్ములేస్తోందని పలువురు వాపోతున్నారు. దుమ్ము, ధూళితో అనారోగ్యం సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని పలువురు పేర్కొంటున్నారు.

అంబేడ్కర్ కలల సాకారానికి కృషి



సమావేశానికి హాజరైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

సిరిసిల్లకల్చరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలు గన్న సమరసతా సమాజం కోసం ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రాంత సహ కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్ స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంబేడ్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా సమరసత సంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రధాన వీధుల్లో సంఘ్ కార్యకర్తలు రూట్ మార్చ్ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎందరో మహాపురుషులకు జన్మనిచ్చిన దేశం ప్రాచీన సాంస్కృతిక వారసత్వం కలిగి ఉందని, ఆది శంకరాచార్యులు, రామానుజులు, బసవేశ్వరులు వంటి మహనీయులు జాతి ఐక్యత కోసం శ్రమించారన్నారు. హిందూ సమాజాన్ని ప్రేమించి లోపాల సవరణకు ఉద్యమించిన అంబేడ్కర్‌ను గొప్ప వ్యక్తిగా కీర్తించారు. అంబేడ్కర్ కృషిని గుర్తించిన దేశం ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తోందన్నారు. జాతి సంఘటన కోసం పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ తో అంబేడ్కర్ సత్సంబంధాలు కలిగి ఉన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘ్ చాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, సహ సంఘ్‌చాలక్ ఎలగందుల సత్యనారాయణ, పబ్బ నాగరాజు, జిల్లా కార్యవాహ్ కొండేటి బాలరాజు, దేవేంద్ర గోనె భూమయ్య, రాజశేఖర్ సుమారు 450 మంది ఆరెఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమొరెడ్డి రామ్‌లు సేవలు మరువలేనివి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవన్‌రెడ్డి, నాయకులు

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు సేవలు మరువలేవని పలువురు పేర్కొన్నారు. పట్టణ శివారులోని వీఆర్ఎం గార్డెన్ ఆదివారం రామ్‌లు పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మీనారాయణ, మృత్యుంజయం, రాష్ట్ర అర్టిక సంఘం చైర్మన్ రాజేశంగౌడ్ తదితరులు హాజరై నివాళులర్పించారు. అనంతరం రామ్‌లు సతీమణి జ్యోతక్క, కుమారులు కరం, విజయ్, కపిల్‌లను వారు పరామర్శించి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా రామ్‌లు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. హైకోర్టు జడ్జి వేణుగోపాల్‌తో పాటు పలువురు న్యాయవాదులు, నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు రామ్‌లుకు నివాళులర్పించారు.

పొన్నాలతో జువ్వాడి సోదరుల భేటీ

కోరుట్ల : ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆదివారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో టీపీసీసీ నాయకుడు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావును కలిశారు. మెట్‌పల్లి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కొమ్‌రెడ్డి రామ్‌లు ద్వాదశ కర్మలో పాల్గొనేందుకు వచ్చిన పొన్నాల లక్ష్మయ్య జువ్వాడి సోదరులను కలిసి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై ఆరాతీశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నిజా మాబాద్ అర్బన్ ఇన్‌చార్జి తాహెర్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, గంగాధర్ గౌడ్, ఉన్నారు.

అభివృద్ధిలో 'గంభీరం'

- జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా గంభీరావుపేట
- నేడు ఢిల్లీలో అవార్డు అందుకోనున్న సర్పంచ్ కటుకం శ్రీధర్ పంతులు

గంభీరావుపేట(సిరిసిల్ల): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ.. స్వయం సమృద్ధి సాధిస్తూ గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ మౌళిక వసతుల కల్పనలో ముందు నిలిచింది. కేంద్రం ప్రకటించిన జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీల జాబితాలో గంభీరావుపేటకు చోటుదక్కింది. సోమవారం ఢిల్లీలో సర్పంచ్ కటుకం శ్రీధర్‌పంతులు అవార్డు అందుకోనున్నారు.

తొలి కేజీ టు పీజీ భవనం

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంత్రి కేటీఆర్ సహకారంతో తొలి కేజీ టు పీజీ ప్రాంగణం గంభీరావుపేటలోనే ఏర్పాటైంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గంభీరావుపేట గల్లీగల్లీలో దాదాపు వందశాతం సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు పూర్తయ్యాయి.
- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరిత హారంలో భాగంగా గంభీరావుపేటలో ఏటా మొక్కలు నాటడం, సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.
- తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణను గంభీరావుపేట గ్రామపంచాయతీ పాలకవర్గం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తోంది. ప్రజలకు ఎలాంటిఅసౌకర్యం కలుగకుండా చూసుకుంటున్నారు.



గంభీరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయం

- మెరుగైన వైద్యం, ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు ఏర్పాటు కావడానికి పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకుంది.

సంతోషంగా ఉంది



అవార్డు అందుకోనుండడం చాలా సంతోషంగా ఉంది. గ్రామస్తులు, తోటి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే ఇది సాధ్యమైంది. అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగింది. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరేలా కృషి చేస్తాను.

– కటుకం శ్రీధర్‌పంతులు, సర్పంచ్, గంభీరావుపేట

వసతులు బాగున్నాయి



గంభీరావుపేటలో ప్రజలకు కావాల్సిన వసతులను గ్రామపంచాయతీ పాలకవర్గం ఎప్పటికప్పుడు కల్పిస్తోంది. అవార్డు రావడంపై సర్పంచ్, పాలకవర్గానికి, అధికారులకు గ్రామస్తుల తరఫున అభినందనలు తెలియజేస్తున్న.

– పెద్దవేని వెంకటియాదవ్, గంభీరావుపేట

అందరి సహకారంతోనే..



అందరి సహకారంతోనే గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీకి జాతీయస్థాయిలో అవార్డు వచ్చింది. సర్పంచ్ శ్రీధర్‌పంతులు ఆధ్వర్యంలో వార్డు సభ్యులందరం ప్రజలకు సౌకర్యాలను కల్పించడంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలను అమలుచేస్తున్నాం. గ్రామపంచాయతీకి జాతీయ అవార్డు రావడం చాలా అభినందనీయం.

– రాచర్ల లత, వార్డుసభ్యురాలు, గంభీరావుపేట

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వేములవాడ రూరల్: వేములవాడ పరిధిలోని కోనాయపల్లి సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే వేములవాడ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ వెంకటేశ్ కోరారు.



ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు



రాగట్లపల్లిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలతో రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. నబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణించొద్దని సూచించారు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: మానసికస్థితి సరిగా లేని ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. జిల్లా కేంద్రంలోని లడ్డుఖాజా హోటల్ ప్రాంతానికి చెందిన గుండ జయలక్ష్మి (70) కొన్ని రోజులుగా వయోభారంతో పాటు మానసిక స్థితి సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోంచి వెళ్లి చింతకుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పట్టణ ఏఎస్సై వేణురావు గజ ఈతగాళ్లతో జయలక్ష్మి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి కుమారులు శ్రీనివాస్, రమేశ్, సంతోష్, కుమార్తె భూలక్ష్మి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న రాజేందర్

ధర్మపురి : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మపురికి చెందిన స్తంభంకాడి రాజేందర్ ఆదివారం పనినిమిత్తం బైక్‌పై వెళ్తుండగా స్థానిక తమ్మళ్లకుంట వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నాడు. తీవ్రగాయాలు కాగా 108లో చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మరో ఘటనలో ఒకరికి..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. తాళ్ల ధర్మారంకు చెందిన లచ్చన్న తన సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా గ్రామ శివారులోని వంతెన వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లచ్చన్నకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.

'భట్టి' పాదయాత్రకు ఘన స్వాగతం

- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- జైకాంగ్రెస్ నినాదాలతో మార్మోగిన ఎల్లంపల్లి



పాదయాత్రలో పాల్గొన్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

రామగుండం: శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఎల్లంపల్లి గ్రామానికి చేరుకుంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చి భట్టికి ఘన స్వాగతం పలికారు. ఆయన అడుగులో అడుగేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వంతెన పార్టీ శ్రేణులతో జనసంద్రంగా మారింది. ఎల్లంపల్లికి చెందిన గంగపుత్రులు చేపలవలను సీఎల్పీ నేతకు బహూకరించి.. సొసైటీల్లో సభ్యత్వాల సమస్య ఉందని ఏకరువు పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గంగపుత్రుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మార్గంమధ్యలో ఉన్న కస్తూర్బా విద్యాలయానికి చేరుకోగానే 9వ తరగతి విద్యార్థిని శరణ్య 'సార్ మాకు తాగునీటి సమస్య ఉంది..' అని తెలపగా సమస్యను నమోదు చేసుకున్నారు. అనంతరం ముర్మూర్ గ్రామ శివారులోని దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గదిలో బస చేసేందుకు వెళ్లారు. సీఎల్పీ వెంట కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక ప్రతినిధులు, పార్టీ శ్రేణులు వేలాదిగా ఉన్నారు.

నియామకం

కోనరావుపేట: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కీసరి లక్ష్మణ్, వేములవాడ మండల అధ్యక్షుడిగా ఎగుర్ల అనిల్, కోనరావుపేట మండల అధ్యక్షుడిగా చెర్లపల్లి వామన్, బోయినిపల్లి మండల అధ్యక్షుడిగా పినమని శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు రాపర్తి భూపతి ప్రకటించారు. కార్యక్రమంలో గంగిపల్లి ప్రేమ్‌సాగర్, ఎన్‌హెచ్ఆర్‌సీ అడ్వైజర్ కీసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగించొద్దు



మురుగు కాల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశీలిస్తున్న గోపాల్‌రావు

ముస్తాబాద్ (సిరిసిల్ల): ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. మోహినికుంటలోని బుడగజంగాల కాలనీలో ఆదివారం ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ సంచులు, కవర్లను వినియోగించవద్దని సూచించారు. వ్యాధులబారిన పడకుండా ఉండేందుకే ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు తెలిపారు.